క్లుప్తంగా

వరద బాధితులకు సాయం



ప్రత్యేక వాహనంతో ఆలయ నిర్వాహకులు మెండా సీతారామయ్య తదితరులు

ధవళేశ్వరం: విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు ధవళేశ్వరం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయ కమిటీ ముందుకు వచ్చింది. గురువారం ఆలయ నిర్వాహకులు మెండా సీతారామయ్య ఆధ్వర్యంలో వరద బాధితులకు అందించేందుకు వెయ్యి చీరలు, 1,500 దుప్పట్లు, 5 వేల మందికి ఆహారాన్ని విజయవాడకు పంపారు. బాధితులకు సాయాన్ని ప్రత్యేక వాహనంలో పంపినట్లు ఆలయ నిర్వాహకులు మెండా సీతారామయ్య తెలిపారు.

ఎస్ఎంఈ లూథరన్ చర్చి సాయం

విజయవాడ వరద బాధితులకు గురువారం ధవళేశ్వరంలోని ఎస్ఎంఈ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆహారాన్ని అందజేశారు. సంఘ ప్యారిస్ పాస్టర్ ,చైర్మన్ అనిల్‌కుమార్ నేతృత్వంలో 2,700 మందికి ఆహార పొట్లాలను తయారు చేసి పంపారు. రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో వాటిని విజయవాడకు తరలించారు.

రూ.2 లక్షల వితరణ



కలెక్టర్ ప్రశాంతికి చెక్కును అందజేస్తున్న డా.చందన పర్వతవర్ధిని, డా.వినయ్ మోహితా తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మాగ్న మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ యాజమాన్యం విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల చెక్కును అందజేసింది. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వతవర్ధిని, డాక్టర్ వినయ్ మోహితా, మదన్ సింగ్‌లు కలెక్టర్ పి.ప్రశాంతికి చెక్కును అందజేశారు.

ఇద్దరు టీచర్లకు ఘన సత్కారం



డాక్టర్ నాగేశ్వరరావు, రమాదేవిని సత్కరిస్తున్న ప్రతినిధులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవిని గురువారం సత్కరించారు. ఆదిత్య డైరెక్టర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాళ్లు సీహెచ్ ఫణి కుమార్, ఎస్‌కేఎన్ రెహమాన్ తదితరులు వారిని సన్మానించారు. ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరరావు ఇందిరాగాంధీ అవార్డును పొందారని, వారికి వచ్చిన గవర్నర్ ప్రధానమంత్రి అవార్డులు కళాశాలకే తలమానికమన్నారు. అదే విధంగా రమాదేవి కూడా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకుని, సాహిత్య, ఎన్ఎస్ఎస్ రంగాల్లో విశేష సేవలందించారని చెప్పారు.

ఉత్సవం.. కారాదు వివాదం

- నగరంలో పోటాపోటీగా వెలుస్తున్న చవితి మంటపాలు
- స్వీయ భద్రతకు పోలీసుల సూచనలు
- నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలంటున్న అధికారులు



వినాయక ఉత్సవానికి పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తున్న మంటపం

కంబాలచెరువు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరమంతటా పండగ వాతావరణం నెలకొంది. ప్రతి కూడలి, వీధుల్లోను నవ రాత్రి ఉత్సవ మంటపాలు ఏర్పాటు చేస్తున్న యువకులతో సందడిగా ఉంది. ఈ పండగ వేడుకల్లో వివాదాలకు తావివ్వకుండా, జాగ్రత్తలు తీసుకుంటేనే ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. ఈ నేపథ్యంలోనే గత అనుభవాల దృష్ట్యా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉత్సవ నిర్వాహకులు కూడా వాటిని పూర్తిగా అనుసరించినప్పుడే గణనాథుని ఆరాధన సాఫల్యమవుతుంది.

అప్రమత్తత అవసరం

ఖాళీ స్థలాల్లోను, గోడౌన్లలో భారీ స్థాయిలో మంటపాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ అలంకరణలతో పాటు, స్వాగత బోర్డులు, ఫ్లెక్సీలు కడుతుంటారు. మూడేళ్ల క్రితం నగరంలో లాలాచెరువు ప్రాంతంలో ఓ మంటపం వద్ద బోర్డు కూలి, కొందరు భక్తులు గాయాల పాలైన సంఘటన చోటుచేసుకుంది. నిర్వాహకులు తప్పనిసరిగా ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యుద్దీపాలతో కాస్త జాగ్రత్త

మంటపాలకు అధికంగా యువతతో పాటు, మహిళలు, చిన్నారులు దర్శనానికి వస్తుంటారు. మంటపంలో ఏర్పాటు చేసిన నేలబారు విద్యుద్దీపాలు, వేలాడే విద్యుత్ తోరణాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. భక్తులు పొరపాటున విద్యుత్ వైర్లను తాకి, విద్యుదాఘాతానికి గురైన సందర్భాలూ ఉన్నాయి. గతేడాది హుకుంపేటలో ఓ మంటపం వద్ద విద్యుదాఘాతానికి గురైన చిన్నారిని స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించి కాపాడారు. కట్ చేసిన విద్యుత్ వైర్లను కలపడం, పిన్నీస్‌తో గుచ్చడం చేస్తుంటారు. ప్రమాదకరమైన ఇటువంటి చోట్ల తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. వాటికి విద్యుత్ నిరోధక టేపును అంటించాలి. తడి కాళ్లు, చేతులతో చిన్నారులు విద్యుత్ తీగలను తాకకుండా చూసుకోవాలి. తలకు తగలకుండా విద్యుత్ తోరణాలను ఎత్తుగా కట్టాలి.

కాపలా బాధ్యత కమిటీలదే..

వినాయక మంటపాలు నగరంలో ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసిన కారణంగా వాటి భద్రత కూడా కీలకమే. పండగ సందర్భంగా యువకుల మధ్య వివాదాలు ప్రేరేపించడానికి కొందరు ఆకతాయిలు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో వినాయక ఉత్సవాలు స్నేహపూర్వకంగా చేసుకునేలా కమిటీ నిర్వాహకులు స్థానిక యువకులకు ప్రాధాన్యం కల్పించాలి. రాత్రి సమయాల్లో మంటపాల వద్ద కొందరు కాపలా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

సీసీ కెమేరాలతో..

మార్కెట్‌లో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమేరాలు రూ.రెండు వేలకే లభిస్తున్నాయి. ప్రతి మంటపం వద్ద సీసీ కెమేరా ఏర్పాటు చేసుకుంటే అదనపు భద్రత ఉంటుంది.

ప్రమాదాలకు గురి కావొద్దు

ఉత్సవాల ఖర్చులకు చందా వసూలు చేసే ప్రక్రియలో స్థానిక యువకులు మంటపాల సమీపంలో రోడ్లపై వాహనాలకు అడ్డంపడి ఆపుతుంటారు. రోడ్లపై వాహనాలకు అడ్డం పడే సందర్భాల్లో ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి విషయాల్లో కమిటీ నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలి. రోడ్లపై తిరిగే వారిని ఇబ్బంది పెట్టకుండా, వేడుకలు సజావుగా నిర్వహించేందుకు ప్రాధాన్యమివ్వాలి.

నిబంధనలు పాటించండి



వినాయక ఉత్సవ కమిటీలకు ఎస్పీ కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు. వాటిని తూ.చ. తప్పకుండా పాటించండి. ఉత్సవాలు ఆధ్యాత్మికతతో నిర్వహించుకోవాలి. మంటపాల వద్ద క్రమశిక్షణతో నడచుకోవాలి. వినాయక విగ్రహాల నిమజ్జనంలో పోలీసుల సూచనలు కచ్చితంగా పాటించాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. అనుమానితులను గమనిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెంటనే తెలియజేయండి.

– దుర్గారావు, టూ టౌన్ సీఐ, రాజమహేంద్రవరం

ఆరోగ్యంపై అవగాహన అవసరం



ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి మనిషి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తే అకాల మరణాలను నివారించవచ్చని ఎల్ఐసీ ఎస్‌డీఎం కె.సంధ్యారాణి అన్నారు. గురువారం స్థానిక మోరంపూడిలోని ఎల్ఐసీ కార్యాలయంలో జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డెల్టా హాస్పిటల్ డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి, సీపీఆర్, ఆర్గాన్ డొనేషన్‌పై అవగాహన కల్పించారు మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, పలువురు మేనేజర్లు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహణకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఆయనతో పాటు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

గురువులతోనే మంచి సమాజం సాధ్యం

సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గురువులను గౌరవించడం ద్వారానే మంచి సమాజం సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం జైల్లో ఘనంగా జరిగాయి. ఖైదీలకు పాఠాలు బోధిస్తూ ఉత్తమ ఫలితాలతో పాటు, వారిలో పరివర్తనకు విశేషంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాస రావు, ఎస్ఎస్ఎస్ శర్మను ఘనంగా సత్కరించారు. ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ బోధిస్తూ 95 శాతం ఉత్తీర్ణత తీసుకురావటం వీరి ప్రతిభ అన్నారు. అలాగే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జైలు ఖైదీకి గోల్డ్ మెడల్ రావడానికి గురువులే కారణమన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం. రాజకుమార్, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, ఇతర సిబ్బంది గురువులను సత్కరించారు.



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గురువులను సత్కరించిన జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తదితరులు

ప్రతి ఒక్కరూ ఉత్తమ ఉపాధ్యాయులే..

కంబాలచెరువు: అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరూ ఉత్తమ ఉపాధ్యాయులేనని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 37 మంది ఉపాధ్యాయులను, 8 మంది సీఆర్పీలను సత్కరించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా సమగ్ర శిక్షా ద్వారా ఐఈఆర్పీలను సత్కరించారు. జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్ సుభాషిణి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి వెంకటరాజు, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి నారాయణ, అర్బన్ ఎంఈఓ-2 రమా రజిని తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసటగా సెంట్రల్ జైలు ఖైదీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి రాజమండ్రి సెంట్రల్ జైలు ఖైదీలు ముందడుగు వేశారు. జైలు పర్యవేక్షణాధికారి ఎస్ రాహుల్ నేతృత్వంలో 25 వేల మందికి టమాటా బాత్ (ఉప్మా) ప్యాకెట్లు సిద్ధం చేసి, గురువారం విజయవాడకు పంపించారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు, జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ ప్రోద్బలంతో ఖైదీలు శ్రమించి, టమాటా బాత్ తయారు చేశారు. కరోనా సమయంలో కూడా జైలు ఖైదీలు లక్ష మాస్కులు తయారుచేసి ఇచ్చారు. ఖైదీలు పెద్ద మనసుతో ఇలాంటి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడం ఆనందదాయకమని సూపరింటెండెంట్ రాహుల్ అన్నారు. ఈ విపత్తు వేళ దాతలంతా ముందుకు రావాలని కోరారు. ఖైదీలకు ఆయన ధన్యవాదాలు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



ఆహార ప్యాకెట్ల వ్యాన్‌ను ప్రారంభిస్తున్న డీపీఓ దాసరి రాంబాబు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పంచాయతీ, రూరల్ మండల పరిషత్, రూరల్ మండల గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో దాతల సహకారంతో విజయవాడ వరద బాధితులకు 7,500 ఆహార ప్యాకెట్లను గురువారం పంపించారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ వాహనాన్ని డీపీఓ దాసరి రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి, డీఎల్పీఓ ఎం.నాగలత, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్.లక్ష్మీరమ్య, ఈఓపీఆర్డీ డి.బాబూరావు, పంచాయతీ కార్యదర్శులు ఎం.రూప్‌చంద్, జి.వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, టి.కృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సృష్టి గణపతి ప్రతిష్ఠాపనతో ఉత్సవాలు

- 64 రూపాల్లో గణపతులు
- పుష్కర ఘాట్‌లో ఉత్సవ కమిటీ ఏర్పాట్లు
- కమిటీ ప్రతినిధులు జక్కంపూడి విజయలక్ష్మి, చల్లా శంకరరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుష్కర్ ఘాట్‌లో ఈ ఏడాది సృష్టి గణపతి విగ్రహం ప్రతిష్ఠించి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు జక్కంపూడి విజయలక్ష్మి, చల్లా శంకరరావు చెప్పారు. దివంగత జక్కంపూడి రామ్మోహనరావు వ్యవస్థాపకులుగా ఆవిర్భవించిన రాజమహేంద్రవరం గణేశ్ ఉత్సవ కమిటీకి పుర ప్రముఖులు పార్టీలకతీతంగా సహకరిస్తున్నారని తెలిపారు. పుష్కర్ ఘాట్‌లో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జక్కంపూడి మాట్లాడుతూ పెన్నులు, గాజులు, నాణాలు , లడ్డూలు ఇలా ఒక్కో ఏడాది ఒక్కో విధంగా గణపతి ప్రతిష్ఠ చేసి, ఉత్సవాలు ముగిసాక భక్తులకు అందించామని గుర్తుచేశారు. భారీ లడ్డూ గణపతి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిందన్నారు. ఈ ఏడాది సృష్టి గణపతి విగ్రహాన్ని ఏడో తేదీ ఉదయం 9.54 గంటలకు ప్రతిష్ఠించి ఉత్సవాలు చేస్తామన్నారు. కృష్ణతో పాటు, సుబ్రహ్మణ్య స్వామి రూపం కూడా ఉండేలా సృష్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 64 రూపాల్లో గణేశ్ విగ్రహాలు భక్తులకు దర్శనమిస్తాయన్నారు. ప్రతిరోజూ పూజలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు సహకరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చల్లా శంకరరావు మాట్లాడుతూ గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శ్రీధర్మశాస్త్రా ఆధ్యాత్మిక కేంద్రం (అయ్యప్ప ఆలయం) నుంచి ప్రతిరోజూ రెండు పూటలా ప్రసాద వితరణ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధులు వాకచర్ల కృష్ణ, అడపా అనిల్, శ్రీకన్య భాను, ఇసుకపల్లి శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



విశ్వపతిని సన్మానిస్తున్న పోసికుమార్ దంపతులు

ధవళేశ్వరం: ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న ధవళేశ్వరం భవిత కేంద్రం ఉపాధ్యాయుడు వడ్డి విశ్వపతిని టీచర్స్ డే సందర్భంగా గురువారం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతులు ఘనంగా సన్మానించారు. సర్వశిక్షా అభియాన్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా విశ్వపతి పురస్కారం అందుకోవడం హర్షణీయమని పోసికుమార్ అన్నారు. మానసిక, దివ్యాంగ చిన్నారులను సొంత పిల్లలుగా చూసుకుంటూ, విద్యను అందిస్తున్న ఐఆర్‌టీ విశ్వపతి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

మోడల్ దుస్తుల తయారీదార్లకు గిరాకీ

రాజమహేంద్రవరం సిటీ: నవీన సమాజంలో మహిళల వస్త్రాలంకరణలో వస్తున్న మార్పుల నేపథ్యంలో వివిధ మోడళ్ల దుస్తుల తయారీదారులకు డిమాండ్ ఉందని ప్రముఖ వ్యాపారవేత్త దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో జరిగిన 73వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న కుట్టుపనివార్లు తక్కువగా ఉండడం వల్ల, వివిధ మోడళ్ల వస్త్రాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నట్లు వివరించారు. మహిళలు కుట్టు శిక్షణ, మగ్గం వర్క్ ద్వారా మంచి సంపాదన పొందవచ్చన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ ప్రతినిధి రాంబాబు మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన మొత్తాలు పొదుపు చేయడం వల్లే, కుటుంబాలు ఆర్థికంగా మనగలుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ 19 వేల మందికి ఉచిత కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, కంప్యూటర్లో శిక్షణ అందించామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. నూతన బ్యాచ్‌కు ఈ నెల 11 వరకు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న మహిళలు

వెలుగు అధికారులపై చర్యలు తీసుకోండి

డీఆర్‌డీఏ పీడీకి వినతి

కడియం: కడియపులంకలో డ్వాక్రా రుణాల అవకతవకలపై లోతుగా విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తికి, కడియపులంక ఇన్‌ఛార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పీడీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడు గ్రూపులకు సంబంధించి సుమారు రూ.20 లక్షలు కడియపులంక డ్వాక్రా యానిమేటర్ గోల్‌మాల్ చేశారని, ఇప్పటికే సంబంధిత సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. 20 నెలలుగా వాయిదా సొమ్ము జమ చేయకపోయినప్పటికీ, బ్యాంకు సిబ్బంది కానీ, వెలుగు అధికారులు కానీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై లోతుగా పరిశీలన చేసి, అవినీతి సిబ్బందిపై చర్యలు చేపట్టాలని రాంజీ డిమాండ్ చేశారు.



డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం ఇస్తున్న రాంజీ తదితరులు

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ గురువారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు బత్తిన నగర్, ఆల్కాట్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్ నగర్, సాయిదుర్గా నగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ఏరియాల్లో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8-12 మధ్య నగరంలోని కొత్తపేట, సోమాలమ్మ డౌన్, రౌతుతాతాలు కల్యాణ మండపం , చర్చిపేట, సీవీ మార్కెట్, మేదరపేట, నల్లమందు సందు, మెరక వీధి, గంటాలమ్మ గుడి, గొల్లమారెమ్మ గుడి, కుమ్మరి వీధి, ఆర్యవైశ్య కల్యాణ మండపం వీధి, శ్యామలా రోడ్, సాయికృష్ణ థియేటర్, డీలక్స్ సెంటర్, టౌన్‌హాల్ రోడ్, పాత కాంగ్రెస్ భవన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సురా బత్తుల వీధి, మంగళవారపుపేట, ట్రైనింగ్ కాలేజీ, గోదావరి బండ్, మదన్ సింగ్‌పేట, బైపాస్ రోడ్ వంకాయలవారి వీధి, వీఎల్ పురం, చైతన్య కాలేజ్ స్ట్రీట్, ఆదర్శ హాస్పిటల్ రోడ్, చక్రధర్ హాస్పిటల్ ఏరియా, తిలక్ రోడ్, ఏవీఏ రోడ్, మోరంపూడి, సత్యనారాయణపురం, రైతుబజార్ రోడ్, కోనేరుపేట, ఆల్‌బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, అమ్మ హాస్పిటల్ స్ట్రీట్, మోడల్ కాలనీ, శ్రీలక్ష్మీ నగర్, గణేష్ నగర్, సాయినగర్, బాపూజీనగర్, గాదాలమ్మ నగర్, వెంకటగిరి, హుకుంపేట, పోస్టల్ కాలనీ, అన్నమయ్య స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వివరించారు.